
‘ఎలివేటెడ్’ భూసేకరణకు రంగం సిద్ధం

- ఎన్‌హెచ్–44, 1 మార్గాల్లో భూసేకరణకు నోటిఫికేషన్
- ఇప్పటికే 169.22 ఎకరాల భూములను అప్పగించిన రక్షణ శాఖ
- తాజాగా ప్రైవేటు ఆస్తుల సేకరణకు నోటిఫికేషన్
- 60 రోజుల్లో పూర్తి కానున్న ప్రక్రియ





ఎన్‌హెచ్–44లో ఎలివేటెడ్ కారిడార్ నిర్మాణ నమూనా చిత్రాలు

కంటోన్మెంట్: ఎలివేటెడ్ కారిడార్ల నిర్మాణానికి సంబంధించి మరో ముందడుగు పడింది. ప్రతిపాదిత రెండు కారిడార్లలో తొలి విడతగా నేషనల్ హైవే –44, 1 మార్గాల్లో భూసేకరణకు రాష్ట్ర ప్రభుత్వం వేర్వేరు నోటిఫికేషన్లు జారీ చేసింది. ఎలివేటెడ్ కారిడార్–1 ప్యారడైజ్ చౌరస్తా నుంచి డెయిరీ ఫామ్ రోడ్డు వరకు, ఎలివేటెడ్ కారిడార్ –2 ప్యాట్నీ సెంటర్ నుంచి శామీర్‌పేట ఓఆర్‌ఆర్ వరకు రోడ్డుకు ఇరువైపులా సేకరించే ఆస్తుల వివరాలను ప్రకటించింది. ఎన్‌హెచ్–44 మార్గంలో 62,152 గజాలు, ఎస్‌హెచ్–1 మార్గంలో 1,62,863 గజాలు సేకరించనున్నట్లు ఈ నోటిఫికేషన్‌లో వెల్లడించారు. 2013 నాటి భూసేకరణ చట్టం సెక్షన్ 11(1), కేంద్ర చట్టం 30/2013 ప్రకారం యజమానులకు పరిహారం చెల్లిస్తామని పేర్కొన్నారు. రెవెన్యూ శాఖ ప్రకటించిన జాబితాలోని ఆస్తులను కలెక్టర్ ముందస్తు అనుమతి లేకుండా విక్రయించకూడదని ఉత్తర్వుల్లో స్పష్టం చేశారు. భూసేకరణ, పరిహారానికి సంబంధించి ఏవైనా అభ్యంతరాలుంటే ఈ నోటిఫికేషన్ జారీ చేసిన 60 రోజుల లోపు జిల్లా కలెక్టర్, ప్రత్యేక డిప్యూటీ కలెక్టర్, పట్టణ భూపరిమితి–భూసేకరణ అధికారులను సంప్రదించాల్సిందిగా సూచించారు.

ఎన్‌హెచ్ -44 మార్గంలో ఇలా..


- జాతీయ రహదారి -44 మార్గంలో ప్యారడైజ్ జంక్షన్ నుంచి డెయిరీఫామ్ రోడ్డు వరకు మొత్తం 5.32 కిలో మీటర్లు, రోడ్డుకు ఇరువైపులా 200 అడుగుల మేరకు విస్తరించనున్నారు. ఇందుకు మొత్తం 73.16 ఎకరాల స్థలం సేకరించాల్సి ఉండగా, ఇందులో 55.85 ఎకరాల రక్షణ భూములను కేంద్రం, రాష్ట్ర ప్రభుత్వానికి అప్పగించింది. రక్షణశాఖ పరిధిలో లేని, ప్రైవేటు, ఇతరత్రా భూముల సేకరణకు తాజా నోటిషికేషన్ జారీ చేయడం గమనార్హం.
- ఆరు లేన్ల ఎలివేటెడ్ కారిడార్‌కు బోయినపల్లి చౌరస్తా వద్ద ర్యాంపులు, తాడ్‌బంద్ చౌరస్తా వద్ద 0.6 కి.మీ.ల టన్నెల్ నిర్మించనున్నారు.
- టన్నెల్ నిర్మాణానికి 8.91 ఎకరాల భూమిని సేకరించనున్నారు.
- భవిష్యత్‌లో మెట్రోరైల్ విస్తరణకు అనుగుణంగా ఉండేలా ఎలివేటెడ్ కారిడార్‌ల నిర్మాణం చేపట్టనున్నారు.

ఎస్‌హెచ్-1 మార్గంలో...

- టివోలీ చౌరస్తా నుంచి శామీర్ పేట వరకు సుమారు 18.1 కిలో మీటర్ల పొడవునా రోడ్డుకు ఇరువైపులా 30 మీటర్ల చొప్పున విస్తరించేందుకు మొత్తం 197.2 ఎకరాల స్థలాన్ని సేకరిస్తున్నారు. ఇందులో 113.4 ఎకరాల రక్షణ భూములను ఈ పాటికే కేంద్రం, రాష్ట్ర ప్రభుత్వానికి అప్పగించింది. తాజాగా సేకరణలో భాగంగా సుమారు 800 మంది ప్రైవేటు వ్యక్తులు/ సంస్థలకు చెందిన 1,62,863 గజాల స్థలాలను సేకరించనున్నారు.
- హకీంపేట ఎయిర్‌ఫోర్స్ స్టేషన్ సమీపంలో 0.450 కిలోమీటర్ల మేర టన్నెల్ నిర్మించనున్నారు.
- కంటోన్మెంట్ పరిధిలోని తిరుమలగిరి, కార్ఖానా చౌరస్తాల వద్ద ఎలివేటెడ్ కారిడార్‌కు అనుగుణంగా ర్యాంప్‌లు నిర్మించనున్నారు.

సేకరించే స్థలాలు ఇవే..

- ప్యారడైజ్ జంక్షన్ నుంచి తాడ్‌బంద్ వరకు ఉన్న మార్గంలో సికింద్రాబాద్ పీజీ కాలేజీకి చెందిన 294 గజాలను సేకరించనున్నారు. ఈ మార్గంలో ఉన్న కంటోన్మెంట్ వాటర్ వర్క్స్ పంప్‌హౌజ్, సర్కిల్ కార్యాలయాలు పాక్షికంగా స్థలాలను కోల్పోనున్నాయి.
- తాడ్‌బండ్ నుంచి బోయిన్‌పల్లి చౌరస్తా వరకు రోడ్డుకు ఎడమవైపున ఉన్న రెండు ముస్లిం గ్రేవీ యార్డులకు సంబంధించి 8,432 గజాల స్థలాన్ని సేకరించనున్నారు.
- బోయిన్ పల్లి చౌరస్తా సమీపంలో పోలీసు క్వార్టర్స్, బోయిన్‌పల్లి జెడ్పీహెచ్ఎస్ స్కూలు, పోస్టాఫీస్, యూపీహెచ్‌సీ, రెడ్‌క్రాస్ ఆసుపత్రి, క్రీడామైదానం తదితర ప్రభుత్వ స్థలాలు 7,518 గజాల సేకరణ జాబితాలో ఉన్నాయి.
- ఆశిష్ గార్డెన్స్ నుంచి బోయిన్‌పల్లి ఏడుగుళ్ల చౌరస్తా వరకు రోడ్డుకు కుడివైపున ఉన్న స్థలాలను కేకే/పట్టా, పోరంబోకు, ఇనామ్/ మఫీ దస్తగారి/ హనుమాన్ దేవస్థానికి సంబంధించి భూములుగా పేర్కొనడం గమనార్హం.
- ఇక బోయిన్‌పల్లి చెక్‌పోస్టు వద్ద గతంలో రక్షణ శాఖ అధికారులు తమ స్థలంగా పేర్కొంటూ కూల్చివేసిన స్థలాలకు ప్రైవేటు వ్యక్తులను యజమానులుగా పేర్కొన్నారు.
- రాష్ట్ర రహదారి -1 మార్గంలో లాంబా, టివోలీ థియేటర్‌లు, మిలీనియం గార్డెన్స్, కేంద్రీ విద్యాలయ సంఘటన్, కేవీ- పికెట్, తిరుమలిగిరి ఆర్టీఏ కార్యాలయంతో పాటు విక్రమ్‌పురి నుంచి తిరుమలగిరి చౌరస్తా వరకు ఉన్న వందలాది కమర్షియల్ భవనాల్లో మెజారిటీ స్థలాలు కనుమరుగు కానున్నాయి.
- తిరుమలగిరిలోని చారిత్రాత్మక ఫుట్‌బాల్ గ్రౌండ్ దాదాపు సగం స్థలం కోల్పోనుంది.





ఎస్‌హెచ్-1 మార్గంలో నిర్మించనున్న ఎలివేటెడ్ కారిడార్ నమూనా చిత్రాలు

రాష్ట్ర ప్రగతికి పరిశ్రమలు ఎంతో కీలకం

అమీర్‌పేట్: రాష్ట్రం ప్రగతి పథంలో దూసుకెళ్ళడంలో, ఉపాధి కల్పనలో ప్రైవేట్ రంగ సంస్థలు, పరిశ్రమలు ఎంతో కీలకమని ఐటీ శాఖామంత్రి దుద్దిళ్ల శ్రీధర్‌బాబు అన్నారు. శుక్రవారం అమీర్‌పేట్ మ్యారిగోల్డ్ హోటల్‌లో ఆయన డెయిరీ ట్రెండ్స్ సంస్థ లోగో, ఉత్పత్తులను ఆవిష్కరణ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరై ప్రసంగించారు. యువతకు ఉపాధితో పాటు స్వయం ఉపాధి కల్పించడంలో కీలకంగా ఉంటున్న వ్యాపారులకు, వాణిజ్య రంగ సంస్థలకు ప్రభుత్వ ప్రోత్సాహం అందిస్తున్నామని, వారికి అన్ని రకాలుగా అండగా ఉండేందుకు పలు పాలసీలను సైతం తీసుకొచ్చామని అన్నారు. వినియోగదారులకు మెరుగైన ఉత్పత్తులతో పాటు నాణ్యమైన ఉత్పత్తులు అందించాలని అప్పుడు వారి ఆదరణ చూరగొంటారని అన్నారు. కార్యక్రమంలో డెయిరీ ట్రెండ్స్ సీఈవో శ్యాంసుందర్ రెడ్డి, షాద్‌నగర్ ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్, మాజీ ఎమ్మెల్యే ప్రతాప్‌రెడ్డి, నిర్మాత బండ్ల గణేష్ తదితరులు పాల్గొన్నారు.



డెయిరీ ట్రెండ్స్ లోగోను ఆవిష్కరిస్తున్న మంత్రి శ్రీధర్‌బాబు

పాలిమర్స్ ఉత్పత్తుల ఆవిష్కరణ

లాలాపేట: సింగిల్ యూజ్ ప్లాస్టిక్‌కు ప్రత్యామ్నాయంగా రూపొందించిన పాలిమర్స్ ఉత్పత్తులను శుక్రవారం ఐఐసీటీలో నిర్వహించిన సదస్సులో మంత్రి శ్రీధర్‌బాబు ముఖ్య అతిథిగా పాల్గొని ఆవిష్కరించారు. పర్యావరణం, పచ్చదనం పెంచేలా సరికొత్త ఆవిష్కరణలను ప్రోత్సహించడమే లక్ష్యం అని పేర్కొన్నారు.



హైదరాబాద్‌ను దేశ రెండో రాజధాని చేయాలి

లాలాపేట: భారత రాజ్యాంగ నిర్మాత డా. బీఆర్ అంబేడ్కర్ లక్ష్యమైన హైదరాబాద్‌ను దేశానికి రెండవ రాజధానిగా సాధించడమే తమ లక్ష్యం అని దక్షిణాది జాయింట్ యాక్షన్ కమిటీ జాతీయ చైర్మెన్ ప్రొఫెసర్ గాలి వినోద్‌కుమార్ అన్నారు. శుక్రవారం తార్నాకలోని డి జాక్ కేంద్ర కార్యాలయంలో అంబేడ్కర్ వర్ధంతి సందర్భంగా ఒక రోజు నిరాహార దీక్ష చేపట్టారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ దేశ రెండవ రాజధానిగా హైదరాబాద్‌ను చేయాలనీ, సుప్రీం కోర్టు బెంచ్‌ను చెన్నైలో ఏర్పాటు చేయాలని, దళిత బహుజనులకు జనాభా దామాషా పద్ధతిలో రిజర్వేషన్లతో పాటు అన్ని రంగాల్లో వర్గీకరణ ద్వారా పంపిణీ న్యాయం చేయాలనీ డిమాండ్ చేశారు. ఉస్మానియా యూనివర్సిటీ జేఏసీ నాయకులు మందాల భాస్కర్, సంజయ్, అశోక్ పాల్గొన్నారు.

ముగిసిన హాకీ మహిళా చాంపియన్‌షిప్

విజేతగా నిలిచిన ఝార్ఖండ్

అడ్డగుట్ట: ఏడాది కాలంలోనే సీఎం రేవంత్‌రెడ్డి నాయకత్వంలో క్రీడారంగంలో సమూల మార్పులు సాధించామని తెలంగాణ స్పోర్ట్స్ అథారిటీ చైర్మన్ శివసేనా రెడ్డి అన్నారు. సికింద్రాబాద్‌లోని ఆర్‌ఆర్‌సీ గ్రౌండ్‌లో జరుగుతున్న 14వ జాతీయ సబ్ జూనియర్ మహిళల హాకీ చాంపియన్‌షిప్ ముగింపు ఉత్సవాలు శుక్రవారం ఘనంగా జరిగాయి. ఈ సందర్భంగా ముఖ్యఅతిథిగా హాజరైన తెలంగాణ స్పోర్ట్స్ అథారిటీ చైర్మన్ శివసేనారెడ్డి మాట్లాడుతూ పది సంవత్సరాల నుండి నిర్వీర్యం అయిపోయిన క్రీడారంగానికి జవసత్వాలు కల్పించే దిశగా ఈ ఏడాది కాలంలో అనేక చర్యలు చేపట్టామని అన్నారు. తెలంగాణ స్పోర్ట్స్ అథారిటీ సహకారంతో దాదాపు 11 రోజుల పాటు 44 మ్యాచ్‌లు నిర్వహించామన్నారు. మొత్తం 29 జట్లు ఈ పోటీల్లో పాల్గొనగా మధ్యప్రదేశ్, ఝార్ఖండ్ రాష్ట్రాల జట్లు ఫైనల్‌కు చేరుకున్నాయి. శుక్రవారం ఈ రెండు జట్ల మధ్య పోటీలో ఝార్ఖండ్ గెలిచింది. ఈ సందర్భంగా ఝార్ఖండ్ జట్టుకు రూ.3 లక్షల నగదు బహుమతి, రన్నరప్‌గా నిలిచిన మధ్యప్రదేశ్ జట్టుకు రూ. 2 లక్షల నగదు పురస్కారం, మూడో స్థానంలో నిలిచిన మిజోరం జట్టుకు రూ. లక్ష నగదు పురస్కారాన్ని స్పోర్ట్స్ అథారిటీ అందజేశారు. అనంతరం, విజేతలకు ట్రోఫీతో పాటు మెడల్స్ కూడా బహూకరించారు. కార్యక్రమంలో తెలంగాణ రాష్ట్ర క్రీడల సలహాదారులు ఏపి జితేందర్‌రెడ్డి, మైనారిటీ విద్యాసంస్థల వైస్ చైర్మన్ ఫహీం ఖురేషి, హాకీ ఇండియా సెక్రటరీ భోలెనాథ్ సింగ్ సింగ్‌లు పాల్గొన్నారు.



విజేత ఝార్ఖండ్ రాష్ట్ర జట్టుతో స్పోర్ట్స్ అథారిటీ బృందం

ఆలయ పాలక మండలి ప్రమాణ స్వీకారం

కంటోన్మెంట్: రాష్ట్రంలో ఆలయాల అభివృద్ధికి ప్రభుత్వం ప్రత్యేక చర్యలు చేపడుతోందని ఎమ్మెల్యే శ్రీగణేశ్ అన్నారు. మారేడ్‌పల్లిలోని సుప్రసిద్ధ సుబ్రమణ్యస్వామి దేవాలయ కమిటీ నూతన పాలక మండలి కార్యక్రమానికి ఆయన ముఖ్య అతిథిగా హాజరయ్యారు. చైర్మన్‌గా రేపాల వెంకటేశ్, సభ్యులుగా పద్మజ, రామ్మోహన్, పరమేశ్, నర్సింగ్, బాలరాజు, శ్రీనివాస్ ప్రమాణ స్వీకారం చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ ఆలయానికి దర్శనానికి వచ్చే భక్తులకు తగిన సౌకర్యాలు కల్పించే దిశగా, ఆలయ అభివృద్ధికి కృషి చేయాలని కమిటీ సభ్యులకు చెప్పారు.



సీఎం తీరుపై విద్యార్థి నేతల అసంతృప్తి

ఉస్మానియా యూనివర్సిటీ: సీఎం రేవంత్‌రెడ్డి తీరుపట్ల ఓయూ విద్యార్థి జేఏసీ నేతలు తీవ్ర అసంతృప్తిని వ్యక్త చేశారు. శుక్రవారం విద్యార్థి జేఏసీ కన్వీనర్ బొరెల్లి సురేష్ మాట్లాడుతూ ఈ నెల 9న ప్రారంభంకానున్న తెలంగాణ తల్లి విగ్రహావిష్కరణకు ఓయూ విద్యార్థి నేతలను ఆహ్వానించక పోవడం విచారకరమన్నారు.

వైభవంగా ధ్వజస్తంభ ప్రతిష్ఠ

సనత్‌నగర్: బేగంపేట శ్యాంలాల్‌బిల్డింగ్స్‌లోని విజయగణపతి ఆలయంలో ధ్వజస్తంభ ప్రతిష్ఠాపన కార్యక్రమం వైభవంగా జరిగింది. స్థానిక నేతలు రాకేష్, శ్రీనివాస్ ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ కూకట్‌పల్లి నియోజకవర్గ ఇన్‌చార్జి బండి రమేష్ ప్రత్యేక పూజా కార్యక్రమాలు నిర్వహించారు.

రాష్ట్రంలో అప్రకటిత ఎమర్జెన్సీ

సనత్‌నగర్: బేగంపేట కార్పొరేటర్ మహేశ్వరిశ్రీహరిని హౌస్ అరెస్టు చేశారు. శుక్రవారం తెల్లవారుజామునే బేగంపేట పోలీసులు ఆమె నివాసానికి చేరుకుని ఆమెతో పాటు భర్త శ్రీహరిని బయటకు రాకుండా అడ్డుకున్నారు. హౌస్ అరెస్టు చేయడంపై బీఆర్‌ఎస్ నేత శ్రీహరి పోలీసులతో వాగ్వివాదానికి దిగారు.

బ్యాడ్మింటన్ అకాడమీలో ప్రవేశాలు కల్పించాలి

ఉస్మానియా యూనివర్సిటీ: నగరంలోని పుల్లెల గోపిచంద్ బ్యాడ్మింటన్ అకాడమీలో పేద క్రీడా కారులకు ఉచిత ప్రవేశం కల్పించాలని స్పోర్ట్స్ ఎండీ సోనిబాలదేవికి వినతి పత్రాన్ని అందచేసినట్లు ఓయూ ఫిజికల్ ఎడ్యుకేషన్ పీహెచ్‌డీ విద్యార్థి, జేబీఎల్ అధ్యక్షులు బాబులాల్ పేర్కొన్నారు.

ఓయూలో వ్యాసరచన పోటీలు

ఉస్మానియా యూనివర్సిటీ: ఓయూ ఆర్ట్స్ కాలేజీ 57వ తరగతి గదిలో ఈ నెల 12న కాంగ్రెస్ పార్టీ ప్రజా పాలన సీఎం రేవంత్‌రెడ్డి ఏడాది పాలన పై రాష్ట్రస్థాయి వ్యాసరచన పోటీలను నిర్వహించన్తున్నట్లు చైర్మన్ కోటూరి మానవత రాయ్ తెలిపారు.

మహిళలు ఆర్థిక స్వావలంబన సాధించాలి

చిలకలగూడ : మహిళలు ఆర్థికస్వావలంభన సాధించిననాడే దేశం ప్రగతిపథంలో ముందుకు సాగుతుందని నగర మేయర్ గద్వాల విజయలక్ష్మి అన్నారు. సికింద్రాబాద్ జీహెచ్ఎంసీ కార్యాలయ ప్రాంగణంలో కంటోన్మెంట్ ఎమ్మెల్యే శ్రీగణేష్‌తో కలిసి ఇందిర మహిళాశక్తి క్యాంటిన్‌ను శుక్రవారం ప్రారంభించారు.

సీఎం చిత్రపటానికి పాలాభిషేకం

ఉస్మానియా యూనివర్సిటీ: జూనియర్ లెక్చరర్ (జేఎల్) ఉద్యోగాలకు ఎంపికైన అభ్యర్థులు ఓయూలో శుక్రవారం సీఎం రేవంత్‌రెడ్డి చిత్రపటానికి పాలాభిషేకం చేశారు. టీజీపీఎస్సీ ద్వారా 1392 జేఎల్ ఉద్యోగాలకు ఎంపికై న అభ్యర్థులకు నియామక పత్రాలను అందచేస్తే ప్రభుత్వ కాలేజీలో చదివే విద్యార్థులకు పాఠ్యాంశంతో పాటు నీట్, ఎంసెట్ పరీక్షలకు బోధించనున్నట్లు పేర్కొన్నారు.

సత్కారం

లాలాపేట: అంతర్జాతీయ దివ్యాంగుల దినోత్సవాన్ని పురస్కరించుకుని ఇటీవల తెలంగాణ రాష్ట్ర గవర్నర్ నివాసంలో దివ్యాంగుల్లోని చాలెంజ్ పర్సన్స్‌ను గుర్తించి సత్కరించారు. ఇందులో తార్నాక డివిజన్‌కు చెందిన పంది శ్రీనివాస్ రాష్ట్ర గవర్నర్ జిష్ణు దేవ్ వర్మ సన్మానించి జ్ఞాపికను అందజేశారు.

సెల్‌టవర్‌ను తొలగించాలి

సనత్‌నగర్: ఎస్‌ఆర్‌టీ కాలనీలో ఏర్పాటుచేసిన సెల్ టవర్‌ను తొలగించాలంటూ స్థానికులు జీహెచ్ఎంసీ కమిషనర్‌కు వినతి పత్రం అందజేశారు. నిబంధనలకు విరుద్ధంగా 75 గజాల్లో నాలుగు అంతస్తులు నిర్మించారని, ఐదో అంతస్తులో ప్రమాదకరంగా సెల్ టవర్‌ను కూడా ఏర్పాటుచేయడంపై వారు అధికారుల దృష్టికి తీసుకువెళ్లారు.

ఘనంగా ప్రజాపాలన విజయోత్సవాలు

సనత్‌నగర్: ప్రజాపాలన-ప్రజా విజయోత్సవాలు సనత్‌నగర్ నియోజకవర్గం బేగంపేట పాటిగడ్డలో శుక్రవారం సాయంత్రం ఘనంగా జరిగాయి. కాంగ్రెస్ పార్టీ సీనియర్ నేత విశాల్ సూదం ఆధ్వర్యంలో జరిగిన ఈ వేడుకలకు సనత్‌నగర్ నియోజకవర్గ ఇన్‌చార్జి కోట నీలిమ ముఖ్యఅతిథిగా హాజరయ్యారు.

అంబేడ్కర్‌కు ఘన నివాళి

భారత రాజ్యాంగ నిర్మాత డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ వర్ధంతి సందర్భంగా శుక్రవారం సికింద్రాబాద్, సనత్‌నగర్, కంటోన్మెంట్ నియోజకవర్గాల్లో పలువురు నాయకులు ఘన నివాళులర్పించారు. అంబేడ్కర్ చేసిన సేవలను ఈ సందర్భంగా నేతలు కొనియాడారు. అంబేడ్కర్ విగ్రహాలకు పూలమాలలు వేసి నివాళులర్పించారు.



అంబేడ్కర్‌కు నివాళులర్పిస్తున్న బీజేపీ నాయకులు



పికెట్ చౌరస్తాలో ఎమ్మెల్యే శ్రీగణేశ్, ఇతర కాంగ్రెస్ నేతలు



సీతాఫల్‌మండి చౌరస్తాలో కార్పొరేటర్ హేమ, దళిత సంఘ ప్రతినిధులు



పార్శీగుట్టలో..



తుకారాంగేట్‌లో..



పికెట్ చౌరస్తాలో ఎండీసీ మాజీ చైర్మన్ మన్నె కృషాంక్...



బోయిన్‌పల్లి మార్కెట్ కమిటీ కార్యాలయ చౌరస్తా వద్ద ఎమ్మార్పీఎస్ నేతలు



సనత్‌నగర్ నెహ్రూపార్కు వద్ద బీజేపీ సీనియర్ నేత వెల్లాల రామ్మోహన్



అమీర్‌పేటలో..

సికింద్రాబాద్‌లో కాంగ్రెస్‌కు పూర్వవైభవం

చిలకలగూడ : సికింద్రాబాద్ నియోజకవర్గంలో కాంగ్రెస్‌కు పూర్వవైభవం తెచ్చేందుకు నాయకులు, కార్యకర్తలు, అభిమానులు సమన్వయంతో కృషి చేయాలని నియోజకవర్గ కాంగ్రెస్ ఇంచార్జి ఆదం సంతోష్‌కుమార్ పిలుపునిచ్చారు. సీతాఫల్‌మండి అంబేడ్కర్ చౌరస్తాలో ప్రజాపాలన విజయోత్సవ బహిరంగ సభ శుక్రవారం నిర్వహించారు. ముఖ్యఅతిథిగా పాల్గొన్న ఆదం సంతోష్‌కుమార్ మాట్లాడుతు సీఎం రేవంత్‌రెడ్డి నేతృత్వంలో అన్ని రంగాల్లోను రాష్ట్రం అభివృద్ధి సాధించిందని అన్నారు. ఎన్నికల మేనిఫెస్టోలో చేసిన అన్ని హామీలు అమలు చేసిన ఘనత కాంగ్రెస్ పార్టీకే దక్కుతుందన్నారు. దొరల గడీల పాలన నుంచి విముక్తమైన తెలంగాణలో ఇప్పుడు ప్రజలంతా సుఖసంతోషాలతో ఉన్నారని అన్నారు. అనంతరం పలువురు మహిళలకు చీరలు పంపిణీ చేశారు. కాంగ్రెస్ నాయకులు జలంధర్‌రెడ్డి, శిల్పచారి, అభిషేక్, అనిల్‌కుమార్, సందీప్, రాజుసాగర్, అమరనాథ్‌గౌడ్, షకీల్‌ఖాన్, వహిదుద్దీన్, చందర్, చక్రధర్, బబ్లూ, మహీందర్, సతీష్, రవిచందర్, బ్రహ్మజీ, కొండల్ తదితరులు పాల్గొన్నారు.



చీరలు పంపిణీ చేస్తున్న ఆదం సంతోష్‌కుమార్

కార్పొరేటర్ హౌస్ అరెస్ట్

అడ్డగుట్ట: బీఆర్‌ఎస్ ఎమ్మెల్యేలు, పార్టీ నేతలపై అక్రమంగా కేసులు బనాయించి అరెస్ట్ చేయడం అప్రజాస్వామికమని కార్పొరేటర్ లింగాని ప్రసన్నలక్ష్మి అన్నారు. బీఆర్‌ఎస్ నేతల అక్రమ అరెస్టులకు వ్యతిరేకంగా శుక్రవారం బీఆర్‌ఎస్ అధిష్టానం నిరసన కార్యక్రమాలకు పిలుపునిచ్చిన నేపథ్యంలో అడ్డగుట్ట కార్పొరేటర్ లింగాని ప్రసన్నలక్ష్మిని తుకారాంగేట్ పోలీసులు శుక్రవారం ఉదయాన్నే గృహ నిర్బంధం చేశారు.

బౌద్ధనగర్: బీఆర్‌ఎస్ నాయకుల అక్రమ అరెస్టులను నిరసిస్తూ అధిష్టానం నిరసన కార్యక్రమాలకు పిలుపునిచ్చిన సందర్భంగా వారాసిగూడ పోలీసులు స్థానిక కార్పొరేటర్ కంది శైలజను ముందస్తు అరెస్ట్ చేశారు. కాంగ్రెస్ ప్రభుత్వం ప్రజా వ్యతిరేక విధానాలను ఇకనైనా మానుకోవాలని కార్పొరేటర్ హెచ్చరించారు.



అడ్డగుట్ట కార్పొరేటర్ ప్రసన్నను గృహ నిర్బంధం చేసిన పోలీసులు



జల్సాల కోసం చోరీల బాట

- రెండు ఘటనల్లో ఏడుగురు బైక్ దొంగల అరెస్ట్
- రూ.9 లక్షల విలువైన ద్విచక్ర వాహనాలు స్వాధీనం

చిలకలగూడ: వృత్తిరీత్యా బైక్ మెకానిక్.. నెలరోజుల క్రితం ఓ యువతిని ప్రేమించి పెళ్లి చేసుకున్నాడు. ఖర్చులు పెరిగాయి, ఆదాయం సరిపోలేదు. జల్సాగా జీవించేందుకు అడ్డదారులు తొక్కాడు. ముగ్గురు మైనర్ బాలురతో ముఠా ఏర్పాటు చేసి పార్కింగ్ చేసిన ద్విచక్ర వాహనాలను చోరీలకు పాల్పడ్డాడు. పాత నేరస్తుడైన నిందితునితోపాటు మైనర్లు పోలీసుల చేతికి చిక్కి కటకటాల పాలయ్యారు. చిలకలగూడ ఠాణా ప్రాంగణంలో శుక్రవారం జరిగిన మీడియా సమావేశంలో చిలకలగూడ ఇన్‌స్పెక్టర్ అనుదీప్, డీఐ రమేష్‌గౌడ్, ఏసీపీ జైపాల్‌రెడ్డి, అడిషనల్ డీసీపీ నర్సయ్యలతో కలిసి ఈస్ట్‌జోన్ డీసీపీ బాలస్వామి వివరాలు వెల్లడించారు. ముషీరాబాద్ బోలక్‌పూర్‌కు చెందిన పస్తం వంశీతేజ అలియాస్ నాగులబండ (21) కుటుంబం కొన్ని రోజుల క్రితం ఫలక్‌నుమా జంగంమెట్‌కు వలస వెళ్లారు. తండ్రి మృతి చెందడంతో 8వ తరగతి వరకు చదివిన వంశీతేజ బైక్ మెకానిక్ షాపులో చేరాడు. రిపేర్లతోపాటు మారుతాళాలతో బైక్‌లను తీయడంలో ఆరితేరాడు. సరూర్‌నగర్‌కు చెందిన ఓ యువతిని ప్రేమించి నెలరోజుల క్రితం పెళ్లి చేసుకున్నాడు. వచ్చే ఆదాయం కుటుంబపోషణకు సరిపోలేదు. భార్యతోపాటు తాను జల్సాగా జీవించేందుకు సులభంగా డబ్బు సంపాదించాలని నిర్ణయించుఉన్నాడు. ముగ్గురు మైనర్లతో ముఠాగా ఏర్పడి, మారుతాళాలతో సులభంగా బైక్ తాళాలు తీసి దొంగతనాలకు పాల్పడ్డాడు. చిలకలగూడ ఠాణా పరిధిలోని గాంధీఆస్పత్రిలో 2, మేడిపల్లి పీఎస్ బోడుప్పల్‌లో 3, ఉప్పల్ ఠాణా పరిధిలో 2 వాహనాలను చోరీ చేసి వానికి విక్రయించేందుకు మైనర్ల ఇంటివద్ద దాచాడు. చోరీ చేసిన వాహనాల్లో తిరుగుతు మరిన్ని వాహనాలను చోరీ చేసేందుకు రెక్కీ నిర్వహిస్తూ శుక్రవారం ఉదయం సీతాఫల్‌మండి చౌరస్తాకు వచ్చారు. తనిఖీలు నిర్వహిస్తున్న పోలీసులను చూసి తప్పించుకునేందుకు యత్నించగా వారిని అదుపులోకి తీసుకుని ప్రశ్నించగా వాహనాల దొంగతనాలు బయటపడ్డాయి. పాత నేరస్తుడైన వంశీతేజ గతేడాది యాదగిరిగుట్టలో గంజాయి కొనుగోలు చేస్తూ పోలీసులకు పట్టుబడి జైలుశిక్ష అనుభవించాడు. బెయిల్‌పై విడుదలైన తర్వాత సుల్తాన్‌బజార్ ఠాణా పరిధిలో సెల్‌ఫోన్ చోరీ కేసులో మరోమారు అరెస్ట్ అయి ఈ ఏడాది సెప్టెంబర్‌లో విడుదల అయ్యాడు.

మరో ఘటనలో...

- అడ్డగుట్ట తుకారంగేట్‌కు చెందిన అద్దాకుల విజయ్‌కుమార్ అలియాస్ వెంకట్ (44) కారుడ్రైవర్‌గా పనిచేస్తున్నాడు. అదేప్రాంతానికి చెందిన ఆలకుంట అక్షయ్ (19)తో కలిసి గాంధీ ఆస్పత్రి ప్రాంగణంలో పార్కింగ్ చేసిన రెండు ద్విచక్ర వాహనాలను దొంగిలించి, బైక్ మెకానిక్ అబ్దుల్ సత్తార్‌కు విక్రయించారు. బాధితుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి సీసీ కెమెరాల ఫుటేజీలను పరిశీలించి నిందితులతోపాటు చోరీ వాహనాలను కొనుగోలు చేసిన సత్తార్‌ను శుక్రవారం అరెస్ట్ చేసి చోరీ చేసిన వాహనాలను స్వాధీనం చేసుకున్నారు.

రెండు కేసుల్లో రూ. లక్షల విలువైన తొమ్మిది ద్విచక్రవాహనాలను స్వాధీనం చేసుకుని నిందితులను రిమాండ్‌కు తరలించామని డీసీపీ బాలస్వామి తెలిపారు. చాకచక్యంగా వ్యవహరించి వాహనదొంగలను అరెస్ట్ చేసిన చిలకలగూడ ఇన్‌స్పెక్టర్ అనుదీప్, డీఐ రమేష్‌గౌడ్, డీఎస్ఐ ఆంజినేయులు, క్రైమ్ టీమ్ జగదీష్, షేక్ మజర్‌బాషా, గణేష్, కృష్ణ, సుధీర్, శివరాజ్, రవీంద్రచారి, ప్రమోద్, దీపక్, నరేష్‌లను పోలీస్ ఉన్నతాధికారులు అభినందించి నగదు రివార్డులు అందించారు.



వివరాలు వెల్లడిస్తున్న ఈస్ట్‌జోన్ డీసీపీ బాలస్వామి, ఇతర పోలీస్ అధికారులు (వృత్తంలో నిందితులు)